క్లుప్తంగా

వాల్మీకులకు రాజకీయంగా ప్రాధాన్యత ఇవ్వాలి



మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాదులు

కర్నూలు (లీగల్) : ఉమ్మడి కర్నూలు జిల్లాలో జనాభాపరంగా అత్యధికంగా ఉన్న వాల్మీకులకు సార్వత్రిక ఎన్నికల్లో ప్రాధాన్యత ఇవ్వాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న యూనైటెడ్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో సీనియర్ న్యాయవాదులు నాగభూషణ నాయుడు, గోపాలకృష్ణుడు, ఆనంద్, భాస్కర నాయుడు మాట్లాడుతూ అత్యధిక జనాభా కలిగిన వాల్మీకులకు రాజకీయంగా సరైన గుర్తింపు లభించడం లేదన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 8 అసెంబ్లీ, కర్నూలు లోక్‌సభ సీటు వాల్మీకులకు ఇవ్వాలని రాజకీయ పార్టీలకు డిమాండ్ చేశారు.

సంతకాల సేకరణ



సంతకాల సేకరణలో పాల్గొన్న డ్రైవర్లు

కర్నూలు(సెంట్రల్): డ్రైవర్లకు తీవ్ర ఆటకంగా మారిన న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. శనివారం న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ జిల్లా మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు.పలువురు డ్రైవర్లు హాజరై కొత్త చట్టాన్ని అమలు చేయరాదని సంతకాలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కోశాధికారి జె.దివాకర్, ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్ పాల్గొన్నారు.

తహసీల్దార్ రమణయ్య హత్యపై నిరసన



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు

కర్నూలు(సెంట్రల్): విశాఖపట్నం జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్ రమణయ్య హత్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు గిరికుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం రమణయ్య హత్యకు నిరసనగా జిల్లాలోని రెవెన్యూ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న గిరికుమార్‌రెడ్డి మాట్లాడుతూ రమణయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, భూ వివాదాలు ఉన్న జిల్లాల్లో పనిచేసే తహసీల్దార్లకు ప్రత్యేక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడిని ఆపాలి



పుస్తకాన్ని విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను ప్రపంచదేశాలు ఆపేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య కోరారు. శనివారం ఆపార్టీ కార్యాలయంలోపాలస్తీనా,ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో రచించిన పుస్తకాన్ని ఆయన విడుదల చేశారు. ఈ పుస్తకంలో ఇజ్రాయెల్ దురాగతాలన్నీ ఉన్నాయని, ప్రతి ఒక్కరూ చదివి పాలస్తీనాకు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పి.రామకృష్ణారెడ్డి, మునెప్ప, పి.జగన్నాథం పాల్గొన్నారు.

పౌరాణిక నాటకాలకు గుర్తింపు



అల్లాబక్ష చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్: పౌరాణిక నాటకాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన కళాకారుడు లొద్దిపల్లి అల్లా బక్ష్ అని పలువురు కళాకారులు అభిప్రాయపడ్డారు. జిల్లా రంగస్థల కళాకారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ రంగస్థల కళాకారులు, ఎన్టీఆర్ అవార్డు గ్రహీత లొద్దిపల్లి అల్లా బక్ష సంస్మరణ సభ శనివారం జిల్లా కోర్టుకు ఎదురుగా ఉన్న యూనైటెడ్ క్లబ్‌లో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కళాకారులు మాట్లాడుతూ అల్లాబక్ష మృతి కళా రంగానికి తీరని లోటన్నారు. గత ఐదు దశాబ్దాలుగా కళా రంగానికి ఆయన విశేష కృషి చేశారన్నారు. శ్రీకృష్ణుడు, హరిశ్చంద్ర, బిల్వమంగుడు పాత్రలు వేసి ప్రేక్షకులను మెప్పించారాన్నారు. కళాకారుల సంక్షేమానికి సహాయ సహకారాలు అందిస్తూ కళామ తల్లి ముద్దుబిడ్డగా నిలిచారన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగభూషణం, ఐక్య వేదిక నాయకులు చంద్రన్న, రమణారెడ్డి, దస్తగిరి, హనుమంతరాయచౌదరి, షఫీవుల్లా, పాండురంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహమ్మారితో భద్రం !



ఒకప్పుడు క్యాన్సర్ బాగా ధనవంతులకు వచ్చేదని నానుడి. ఆ తర్వాత ఆ వ్యాధి మధ్యతరగతి వారికి కూడా రావడం మొదలైంది. ఇప్పుడు పేద, మధ్య, ధనిక తేడా లేకుండా అందరికీ వస్తోంది. ప్రమాదకర ఈ వ్యాధికి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడమే మేలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. నేడు ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కథనం.

- అన్ని వర్గాల ప్రజలను వేధిస్తోన్న క్యాన్సర్
- ఏటేటా పెరుగుతున్న కేసులు
- ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా చికిత్సనందిస్తున్న ప్రభుత్వం
- 2019లో 1,78,161 మందికి వైద్యం
- ముందుజాగ్రత్త చర్యలే మేలంటున్న వైద్యనిపుణులు
- ప్రారంభానికి సిద్ధమవుతున్న స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్
- నేడు ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినం

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో క్యాన్సర్ రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కర్నూలు, నంద్యాల ప్రాంతాల్లో ఆధునిక వైద్య సౌకర్యాలు, ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించే అవకాశాలు రావడంతో చాలా మంది చికిత్స కోసం ఆసుపత్రులకు వస్తున్నారు. ఈ మేరకు ప్రస్తుతం జిల్లాలో ఆరు శాతం మంది క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు వైద్యవర్గాలు అంచనా వేస్తున్నాయి. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాన్సర్ విభాగంలో కొన్ని దశాబ్దాలుగా క్యాన్సర్ రోగులకు వైద్యసేవలు అందిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ రోజూ 10 మంది కొత్తవారు, 15 మంది పాత రోగులు చికిత్స కోసం వస్తున్నారు. ఈ విభాగంలో ఎప్పుడూ 60 నుంచి 80 మంది దాకా రోగులు చేరి చికిత్స తీసుకుంటున్నారు. ఈ ఆసుపత్రితో పాటు నగరంలోని ఒమెగా హాస్పిటల్, నగర శివారులోని పెంచికలపాడు గ్రామంలోని విశ్వభారతి క్యాన్సర్ హాస్పిటల్‌లోనూ క్యాన్సర్ చికిత్స అందిస్తున్నారు. ఆయా ఆసుపత్రుల్లో రోజూ 150 నుంచి 200 మంది దాకా రోగులు చికిత్స కోసం వస్తున్నారు.

ఆరోగ్యశ్రీలో ఉచితంగా చికిత్స

వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాదాపుగా అన్ని రకాల క్యాన్సర్ వ్యాధులకూ డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చికిత్స అందుతోంది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు విశ్వభారతి క్యాన్సర్ హాస్పిటల్, ఒమెగా క్యాన్సర్ హాస్పిటల్, నంద్యాలలోని శాంతిరామ్ హాస్పిటల్‌ల్లో క్యాన్సర్ వ్యాధులకు ఈ పథకం కింద ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లోనూ క్యాన్సర్ కణతులు తొలగించే శస్త్రచికిత్సలు కూడా ఉచితంగా చేస్తున్నారు.

క్యాన్సర్ వ్యాధి లక్షణాలు

ముక్కు, నోటి నుంచి రక్తస్రావం, గడ్డలు ఏర్పడటం, రొమ్ము క్యాన్సర్‌లో రొమ్ము వద్ద చనుమొనలో ద్రవం కారడం, చర్మంలో మార్పు, పేగుల్లో బల్లలు ఏర్పడటం, పురీషనాళంలో నొప్పి, ఊపిరితిత్తుల క్యాన్సర్‌లో నిరంతర దగ్గు, కఫంలో రక్తం పడటం, ఛాతినొప్పి, బ్రెయిన్ క్యాన్సర్‌లో భరించలేని తలనొప్పి, వికారం, వాంతులు, అవయవాల్లో బలహీనత. క్యాన్సర్ లక్షణాలు దాని రకంపై ఆధారపడి ఉంటాయి. చిన్న పరిమాణపు క్యాన్సర్ లేదా ప్రాథమిక దశల్లో ఉన్న వాటికి చికిత్స చేయడం సులభం

క్యాన్సర్ వ్యాధికి కారణాలు

క్యాన్సర్ వ్యాధి రావడానికి 4 శాతం జన్యుపరంగా, 6 శాతం తీసుకునే నీరు, ఆహారం, 15 శాతం స్థూలకాయం(రొమ్ము, గర్భాశయం, పేగు, మూత్రపిండాల క్యాన్సర్లు), 40 శాతం పొగాకు (నోరు, ఊపిరితిత్తుల క్యాన్సర్‌లు), 10 శాతం ఇన్‌ఫెక్షన్లు(హెచ్‌పీవీ, హెపటైటిస్ బి వల్ల వచ్చే కాలేయ క్యాన్సర్) కారణం. మిగిలిన 25 శాతం క్యాన్సర్ల(రక్తం, ఎముక, ప్యాంక్రియాస్‌ల క్యాన్సర్)లకు సరైన కారణాలు లేవు.

ఇలా నివారించవచ్చు

- పొగాకు మద్యపానం మానేయాలి.
- పరిశుభ్రమైన నీరు, ఆహారం తీసుకోవాలి
- నీళ్లు 4 నుంచి 5 లీటర్లు ప్రతిరోజూ తాగాలి
- హెచ్‌పీవీ, హెపటైటిస్ బి టీకాలు వేయించుకోవాలి
- పండ్లు, ఆకుకూరలు తినాలి.
- పొట్టేలు మాంసం తగ్గించాలి. చేపలు, కోడి మాంసం తినాలి.
- స్థూలకాయం తగ్గించుకోవాలి. రోజూ వ్యాయామం చేయాలి.

సిద్ధమైన స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణం పూర్తయ్యింది. త్వరలో దీనిని ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రూ.120 కోట్లతో 120 పడకల సామర్థ్యంతో నిర్మించిన ఈ ఆసుపత్రిలో అత్యాధునిక లీనియర్ ఆక్సలరేటర్ (రేడియేషన్ మిషన్), ఎక్స్‌టర్నల్ ఆర్‌టీ మిషన్, బ్రాచి థెరపీ హెచ్‌డీఆర్(నేరుగా క్యాన్సర్ కణితిపై రేడియేషన్ ఇస్తారు), సిటి సిమిలేటర్, ప్రత్యేకంగా రేడియాలజి విభాగం, పెథాలజి, మైక్రోబయాలజి విభాగాల సేవలు అందుబాటులోకి వస్తాయి. వీటితో పాటు రేడియేషన్ థెరపిస్ట్, మెడికల్ రేడియేషన్, సర్జికల్ రేడియేషన్, సర్జికల్ ఆంకాలజిస్ట్, పీడియాట్రిక్ సర్జరీ పోస్టులు, స్టాఫ్‌నర్సులు, పారామెడికల్ సిబ్బంది, నాలుగో తరగతి సిబ్బంది నియమితులవుతారు. ఈ మేరకు తాజాగా నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. దీంతో రాష్ట్ర స్థాయిలో ఇక్కడే అత్యాధునిక క్యాన్సర్ వైద్యసేవలు ఇక్కడ అందనున్నాయి.

ఐదేళ్లుగా ఆరోగ్యశ్రీలో క్యాన్సర్ చికిత్సలు

సంవత్సరం	సర్జికల్	మెడికల్	రేడియేషన్
2019	8,596	10,846	8,306
2020	9,564	12,235	9,325
2021	10,396	14,214	10,103
2022	12,659	15,045	12,435
2023	14,256	16,258	13,923
మొత్తం	55,471	68,598	54,092

చికిత్స కంటే నివారణ మార్గమే మేలు



2022లో భారత దేశంలో 14.13 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు, 9.16లక్షల మరణాలు నమోదయ్యాయి. మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ అగ్రస్థానంలో ఉన్నాయి. పురుషుల్లో నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, అన్న వాహిక క్యాన్సర్లు ఎక్కువగా ఉన్నాయి. ప్రతి ఐదుగురిలో ఒకరు తమ జీవితకాలంలో క్యాన్సర్‌ను ఎదుర్కొంటున్నారు. కావున ఈ వ్యాధి వచ్చాక చికిత్స చేయించుకోవడం కంటే రాకుండా ముందు జాగ్రత్త చర్యలతో పాటు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి.

–డాక్టర్ సి. వాసురెడ్డి, సర్జికల్ ఆంకాలజిస్టు, కర్నూలు

ఆరోగ్యశ్రీలో క్యాన్సర్‌కు ఉచిత చికిత్స



డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో అన్ని రకాల క్యాన్సర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చికిత్స అందిస్తోంది. ఈ మేరకు జిల్లాలోని అన్ని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో వైద్యులు చికిత్స చేస్తున్నారు. వ్యాధి లక్షణాలున్న వారు వెంటనే సంబంధిత ఆసుపత్రులకు వెళ్లి చికిత్స చేయించుకోవచ్చు. ఇది పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు. క్యాన్సర్ చికిత్స ప్రైవేటులో ఎంతో ఖరీదైనది. కొన్నిసార్లు లక్షల రూపాయలు దీని కోసం ఖర్చు చేయాల్సి వస్తుంది. ఆరోగ్యశ్రీలో దీనిని చేర్చడం వల్ల ఎంతో మంది ప్రాణాలు కాపాడటంతో పాటు ఆర్థిక ఇబ్బందుల నుంచి వారు బయటపడుతున్నారు. –డాక్టర్ భాస్కరరెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్, కర్నూలు

పెత్తందార్లపై పోరుకు సిద్ధం



సిద్ధం కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, పార్టీ నాయకులు

- సిద్ధం కార్యక్రమం పోస్టర్ల ఆవిష్కరణలో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): మంచి పనులను అడ్డుకుంటున్న పెత్తందార్లపై పోరుకు మేము సిద్ధం అని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం స్థానిక రాయల్ ఫంక్షన్ హాలులో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే సిద్ధం పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా రాష్ట్రంలో జగనన్న నాయకత్వంలో సుపరిపాలన అందుతుందన్నారు.దీనిని ఓర్వలేక రాజకీయ లబ్ధి కోసం ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమయ్యాయన్నారు. అయినా ప్రజలు వారిని నమ్మరన్నారు. జనరంజక పాలన కోసం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

అంగన్ వాడీ కేంద్రంలో అభివృద్ధి పనులు ప్రారంభం

స్థానిక 4 వ వార్డు పరిధిలోని అంగన్ వాడీ కేంద్రంలో నూతనంగా నిర్మించిన వంటగది తదితర అభివృద్ధి పనులను శనివారం సాయంత్రం ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక వార్డు కార్పొరేటర్ అర్షియా ఫర్హీన్, రియాజ్, ఫాజిల్, మల్లేష్, కేధార్‌నాథ్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ స్పష్టం చేశారు. శనివారం ఎమ్మెల్యే తన స్వగృహంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. పలువురు తమ సమస్యపై ఎమ్మెల్యేకు వినతులు అందజేశారు.

మహిళ కడుపులో 12 కిలోల కణితి

కర్నూలు(హాస్పిటల్): క్యాతూరు గ్రామానికి చెందిన చిన్నమద్దిలేటి భార్య లక్ష్మీదేవికి గత మూడు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతుండేది. ఈ నేపథ్యంలో ఎన్ఆర్ పేటలోని గైనకాలజిస్టు డాక్టర్ శశికళ వద్దకు చికిత్సకోసం వెళ్లింది. వైద్యపరీక్షలు చేసిన అనంతరం ఆమె గర్భాశయం వద్ద 12 కిలోల కణితి ఉన్నట్లు గుర్తించారు. దీంతో గత నెల 30న ఆమెకు ఆపరేషన్ చేసి గర్భసంచితో పాటు కణితిని తొలగించారు. ప్రస్తుతం కోలుకోవడంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు.

8న ఆశావర్కర్ల చలో విజయవాడ

కర్నూలు(సెంట్రల్): ఆశావర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 8వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆశావర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు జె.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన కేకే భవన్‌లో మాట్లాడుతూ..ఆశా వర్కర్లకు పదవి విరమణ 62 ఏళ్లకు పెంచాలన్నారు. ప్రమాదం జరిగితే కోలుకోవడానికి అవసరమైన సెలవులు ఇవ్వాలన్నారు. ఈడిమాండ్ల సాధనకు చేసే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు : తన ఇంటిపై గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేసి నష్టపరిచారని రాయలసీమ విద్యార్థి సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు సీమ కృష్ణ డీఎస్పీ విజయశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. రాయలసీమ హక్కుల కోసం నీళ్లు, నియామకాల కోసం ప్రశ్నిస్తే శుక్రవారం అర్ధరాత్రి వచ్చి కొందరు రాళ్లతో దాడి చేశారని డీఎస్పీకి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి దుండగులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా వినతిపత్రంలో కోరారు. రాయలసీమ యువజన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు వి.వి.నాయుడు, రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్, జిల్లా అధ్యక్షుడు అశోక్, రాయలసీమ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుంకన్న, రాయలసీమ విద్యార్థి సమైక్య జిల్లా అధ్యక్షుడు భూషణ్, వెంకటేష్ తదితరులు డీఎస్పీని కలసినవారిలో ఉన్నారు.

సంక్షిప్తం

విద్యుత్ కార్మికుల హామీలు అమలు చేయాలి

కర్నూలు(సెంట్రల్): విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు కోరారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా స్ట్రగుల్ కమిటీ గెలుపులో భాగంగా లేబర్ కార్యాలయంలో డిమాండ్లతో కూడిన వినతిపత్రం అధికారులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం తరహాలో కాంట్రాక్ట్ కార్మికులందరికీ నేరుగా జీతాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకుడు నాగరాజు యాదవ్ పాల్గొన్నారు.

ఏపీటీడీసీ యూనిట్లకు కొత్త మేనేజర్లు

కర్నూలు కల్చరల్: ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే హరిత హోటల్స్, రెస్టారెంట్ యూనిట్లకు నూతన మేనేజర్లు నియమితులైనట్లు ఏపీటీడీసీ కర్నూలు డివిజనల్ మేనేజర్ చంద్రమౌళీశ్వరరెడ్డి తెలిపారు. ఈ మేరకు కార్పొరేషన్ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. కర్నూలు పున్నమి హరిత హోటల్స్ యూనిట్ మేనేజర్‌గా కృష్ణా జిల్లాకు చెందిన బొంత సతీష్, ఓర్వకల్ యూనిట్ మేనేజర్‌గా పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన జీవన్ నియమితులయ్యారని పేర్కొన్నారు. వీరు బాధ్యతలు కూడా స్వీకరించారని తెలిపారు.

7 నుంచి మెడికల్ రెప్స్ యూనియన్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు



రాష్ట్ర మహాసభలు, జాతీయ కౌన్సిల్ సమావేశాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కర్నూలు(హాస్పిటల్): ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు, జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు విజయవాడలో నిర్వహిస్తున్నట్లు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు, జాతీయ కౌన్సిల్ సభ్యులు వెంకట్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కర్నూలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. సమావేశాలకు దేశవ్యాప్తంగా 300 మంది ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రధానంగా ఈ సమావేశాల్లో ప్రజల ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన అనేక అంశాలపై చర్చలు నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ ఎదుర్కొంటున్న పనిభారం, అనధికారికంగా తొలగింపులు, చట్టబద్ధతలేని పర్యవేక్షణ, రాజ్యాంగ బద్ధంగా సాధించుకున్న సేల్స్ ప్రమోషన్ చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించేందుకు చర్చ నిర్వహిస్తామని వారు చెప్పారు. రైట్ టు హెల్త్ ఫర్ ఆల్ అనే నినాదంతో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు, కార్యదర్శి బసవరాజు, అధ్యక్షులు శివగంగ, మారుతి, సురేంద్ర, ఖలీల్, శేషాద్రి, నాగయ్య, ప్రజా ఆరోగ్య వేదిక కన్వీనర్ ప్రసాదశర్మ పాల్గొన్నారు.

ఈ రోజు

సత్యసాయి సేవా ట్రస్ట్ సమావేశం

కర్నూలు కల్చరల్: సత్యసాయి సేవా ట్రస్ట్ జిల్లా స్థాయి సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరంలో నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు మాకా అశోక్ కుమార్ తెలిపారు. ట్రస్ట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్ర, సేవా విభాగం అధ్యక్షుడు శ్యామ్‌లు సమీక్ష సమావేశానికి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఆఫీస్ బేరర్లు సంబంధిత రిపోర్ట్‌లతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం

కర్నూలు(హాస్పిటల్): ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 4వ తేదీన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వీఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సర్జికల్ ఆంకాలజిస్టు డాక్టర్ సి. వాసురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఈ వైద్యశిబిరం ప్రకాశ్‌నగర్‌లోని వీఆర్ హాస్పిటల్‌లో నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గుండెపోటుపై అవగాహన సదస్సు

కర్నూలు (హాస్పిటల్) : గుండెపోటు సమస్యపై ఈనెల 4వ తేదీన అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు స్థానిక ఎ.క్యాంప్‌లోని కర్నూలు హెల్త్ క్లబ్‌లో సదస్సు నిర్వహిస్తామన్నారు. గుండెపోటు గురించి తాను వివరించనున్నట్లు ఆయన వెల్లడించారు.


ముగిసిన వర్క్‌షాపు



వర్క్‌షాపులో సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో రవీంద్ర విద్యా సంస్థల చైర్మన్ జీవీఎం మోహన్‌కుమార్, తదితరులు

కర్నూలు సిటీ: జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీలో రీసెర్చ్ మెథడాలజీపై రెండు వారాల పాటు జరిగిన వర్క్‌షాపు శనివారంతో ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి రవీంద్ర విద్యా సంస్థల చైర్మన్ జి.వి.ఎం. మోహన్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు. ఎంబీఏ విభాగం వారు రెండు వారాల పాటు నిర్వహించిన వర్క్‌షాపు పరిశోధనలకు చక్కగా ఉపయోగపడుతుందన్నారు. ఎంబీఏ చదువుతున్న విద్యార్థులు పురోగతి చెందాలంటే సి.లాంగ్వేజీ, ఎస్ క్యూఎల్ లాంటి ప్రోగ్రామ్స్ ఏపీ అవసరం లేదన్నారు. డిజిటల్ మార్కెటింగ్ పైన డేటా అనలిటిక్స్‌పైన పట్టు సాధించగలిగితే ఇంజినీరింగ్ విద్యార్థులకు దీటుగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి అన్నారు. అనంతరం వర్క్‌షాపులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డా.సి. శ్రీనివాసరావు, ఎంబీఏ విభాగాధిపతి డా.ఎం గిరిధర్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మధ్యప్రదేశ్ వాసి మృతి



మృతిచెందిన ధర్మేంద్ర సత్నామి

కర్నూలు: మండల పరిధిలోని నూతనపల్లె గ్రామ పొలిమేరలో కర్నూలు నగర డంప్ యార్డు సమీపంలో హిటాచి ప్రమాదంలో మధ్యప్రదేశ్ రాష్ట్రం సత్న జిల్లా హిరాండి గ్రామానికి చెందిన ధర్మేంద్ర సత్నామి (27) మృతిచెందారు. కర్నూలు శివారులోని రింగ్ రోడ్డు నుంచి ఆత్మకూరు వరకు జరుగుతున్న రహదారి నిర్మాణ పనుల కోసం కార్పొరేషన్ డంప్ యార్డు వద్ద కొండను తవ్వి మట్టిని రోడ్డుకు తరలిస్తున్నారు. దాదాపు 30 అడుగుల ఎత్తు గల కొండను ఎక్స్‌కవేటర్‌తో (హిటాచి) తవ్వుతుండగా శుక్రవారం రాత్రి కొండపై నుంచి మట్టి పెళ్లలు కూలి ఎక్స్‌కవేటర్‌పై పడటంతో ఆపరేటర్ ధర్మేంద్ర మట్టిలో కూరుకుపోయాడు. సైట్ సూపర్‌వైజర్ బోయ నవీన్ గుర్తించి వెంటనే మట్టిని తొలగించి ధర్మేంద్రను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి సోదరుడు మోహిత్ సత్నామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి సంఘటనా పూర్వాపరాలపై దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

కర్నూలు(సెంట్రల్): సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. జగన్నాథం శనివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల ఎమ్మిగనూరు మండలంలో వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు అమర్చుతున్న సమయంలో అడ్డుకోవడంతో 8 మందిపై కేసులు పెట్టారన్నారు. వెంటనే ఈ కేసులను ఎత్తివేయాలని వారు కోరారు.

ఉపాధి పనులకు కూలీల సంఖ్య పెంచండి

- రోజుకు 70 వేల మందికి పనులు కల్పించాల్సిందే
- ఏపీడీలకు డ్వామా పీడీ అమరనాథరెడ్డి ఆదేశం



ఏపీడీలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ అమరనాథరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ పనులు ముగింపు దశకు వచ్చిన నేపథ్యంలో ఉపాధి పనులకు కూలీల సంఖ్య గణనీయంగా పెంచాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్లను ఆదేశించారు. రోజుకు 70 వేల మందికి ఉపాధి పనులు కల్పించాలనేది లక్ష్యమని, ప్రస్తుతం 45 వేల మంది మాత్రమే ఉపాధి పనులకు హాజరవుతున్నారని తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని డ్వామా కార్యాలయంలో ఉన్న తన చాంబరులో ఏపీడీలతో వివిధ అంశాలపై సమీక్షించి మాట్లాడారు. క్రిష్ణగిరి, చిప్పగిరి, ఎమ్మిగనూరు, కర్నూ లు రూరల్, గోనెగండ్ల, సి.బెళగల్, నందవరం తదితర మండలాల్లో లేబర్ రిపోర్టింగ్ అతి తక్కువగా ఉందని, ఈ ప్రాంతాలపై వెంటనే దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ నెల 5 నుంచి లేబర్ రిపోర్టింగ్‌ను పెంచాలని సూచించారు. త్వరలో సార్వత్రిక ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉందని ఆలోపు లేబర్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉపాధి పనులను గుర్తించి సెల్ఫ్‌లో ఉంచుకోవడంతో పాటు వాటికి జిల్లా కలెక్టర్ నుంచి పరిపాలన అనుమతులు కూడా తీసుకోవాలన్నారు. ఫాంపాండ్స్, అమృత్ సరోవర్‌లు, మినీ అమృత్ సరోవర్‌లు వంటి ప్రజోపయోగ పనులను గుర్తించాలని సూచించారు. వచ్చే సంవత్సరంలో పండ్లతోటల అభివృద్ధికి అర్హులైన రైతులను గుర్తించే కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని పేర్కొన్నారు. 10 వేల ఎకరాల్లో పండ్లతోటల అభివృద్ధి చేయాలనేది లక్ష్యమని, ఇప్పటి వరకు 2500 ఎకరాలకు మాత్రమే రైతులను గుర్తించారని తెలిపారు.

రామలింగేశ్వర్ నగర్‌లో చోరీ

కర్నూలు : నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామలింగేశ్వర్ నగర్‌లో శనివారం చోరీ జరిగింది. కాలనీలో నివసించే పుష్పలత అనే మహిళ గత నెల 25న బంధువులను చూసేందుకు హైదరాబాద్ వెళ్లింది. వారం రోజులుగా అక్కడే ఉంది. ఇంటికి తాళం వేసిన విషయాన్ని గుర్తించిన దొంగలు ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న 5 తులాల బంగారం, రూ.9 వేల నగదు, వెండి దొంగలించి ఉడాయించారు. చుట్టు పక్కల వారు గమనించి సమాచారం ఇవ్వడంతో ఆమె ఇంటికి చేరుకుంది. తాళం పగులగొట్టడంతో పాటు ఇంట్లో సామన్లు చిందరవందరగా ఉండటంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.